# భిక్షుకి ★

రచన:
శ్రీ ఓరుగంటి భైరవశాస్త్రి

ముందు కొండలకు నిండు తటాకము ఇగిరి ఆర్చుక పోగా, బిగటలుదేరిన బొరియల్లో దాగొనే చేప పిల్లల్లా, నీలిమేఘాల వెనుక కళావిహీనములైన తారకలతో నిండిన ఆకాశము...!

రంధ్రరంధ్రాలలో నూటిపోటుగ దూరి, నాడులు తోడుకుపోయి, రక్తం గడ్డకట్టుకజేసే, నిర్భాగ్యపు నిర్దయారాసి శీతాకాలపు రాత్రి...!

అగ్నిచాలక, హిమాన్నికూడా స్నేహితునిగా జేకొన ప్రయత్నించే, వాయుదేవుని ప్రచండ ప్రయత్నము...!

మేఘాకృతమై, శీతల ప్రచండ వాయువులచే నిండిన నిబిడీకృత ప్రకృతి...!

అంతటి నిశీథసమయంలో, కాళరాత్రి వెనుచీకటిలో, డొక్కలు అతుక్కుపోయి, బోర ఆరిపోయి, కృంగి కృశించిన రెండు జీవచ్ఛవాలు మాత్రం ఆ పెద్ద వటవృక్షంక్రింద విశ్రాంతి తీసుకుంటున్నాయి.

పసిపాపని ప్రేమమీర గుండెలకు హత్తుకొని, ఆతన్మయత్వంలో సర్వం మరచి, సంతోష వారాబ్ధిలో క్షణకాలమైనా ఈదులాడ ప్రయత్నించే మాతృహృదయం!

బిడ చేతులను మెడకు పెనవేసి, భయభ్రాంతులచే బిక్కజచ్చి, చలిగాలికి కొయ్యబారి తెల్లబోయి తల్లిముఖంలోకి చూస్తున్న ఆరేండ్ల పసిబాలుడు.

"అమ్మా...!" గజగజ వణికిపోయే పెదవుల నుండి వెలువడిన రెండు కంపితస్వరాలు.

"ఏం బాబూ?" అంటూ మరి గాఢంగా హృదయానికి హత్తుకుంది ఆమాతృదేవత. కాని గుండెలు మాత్రం గడియారంలో సెకెను ముల్లులా శరవేగంతో కొట్టుకుంటున్నాయి. ఎందుకో?

"అమ్మా...చలీ!" ఎలాగో అతిప్రయాస మీద వెలువడ్డాయి.

"ఫరవాలేదు...నాయనా! ఇది కప్పుకో" అంటూ పిండిజల్లెడలా, చింకిపోయిన చిన్నగుడ్డను దీనిపైన కప్పి బోగొట్టుతోంది.

"అమ్మా...పోనీ!"—ఏదో అనబోయి సగంలో ఆగేడు. బుర్రలో ఏదోసందేహం మాత్రం పట్టుకు పీకుతున్న మాట వాస్తవం.

"ఏమిటి...బాబూ—చెప్పు!" "ఇంకా చలిగా ఉందా?" దీనంగా అడిగింది తల్లి.

"పోనీ...ఇక్కడ ఇంత చలిగా ఉంది గాని...అలా—ఇళ్ళళ్ళో ఉంటే చలివేయదు గాదే?" అన్నాడు తల్లి ముఖంలోకి చూస్తూ.

"ఉండదు నాయనా!" అంది తల్లి కొంత నిదానంగా!

"అయితే పోనీ..మనం, అలాగే ఉండకూడదూ?" దీర్ఘంగా చూస్తున్నాడు. సమాధానం కోసం ఆతృతగా చూస్తోంది ఆ చిన్ని హృదయం!

"ఉండొచ్చును లేరా!" అంది కొంతవ్యథతో.

"మరేం! పద దోదాం" అన్నాడు ఉద్రేకపూర్వకంగా.

"మనకి అలాంటి ఇళ్ళు లేదు...అందుకు మనం ఇక్కడే ఉండాలి నాయనా!" అంది తల్లి. ఆనాలుగు ముక్కలు చెప్పేలోగా రెండు మూడు మార్లు గుటకలు మాత్రం మింగింది.

"ఎందుకు లేదు?" క్రాసుపరీక్షచేసే సబ్ ఇన్స్పెక్టర్ ధాటీమాత్రం అందులో దోక్యమవుతోంది!

"వాళ్ళంతా డబ్బున్న వాళ్ళు...డబ్బుంటే అలాటి ఇళ్ళు వాకిళ్ళు ఉంటాయి...మనకి డబ్బు లేదు. డబ్బు ఉన్నవాళ్ళం కాము...అందుచే మనం ఇక్కడే ఉండాలి" విద్యార్థికి బోధించే ఉపాధ్యాయినిలా విడదీసి మరీ చెప్పింది. అబ్బాయికి మాత్రం అంతా అయోమయంగా ఉంది. తల్లిమాటలు అతడికి అర్థంకాలేదు. ముందు ఇల్లు లేదండి!" ఎందుకు లేదంటే?" "డబ్బు లేదంది!" దీనికి దానికి సంబంధం ఏమిటి? డబ్బుంటేకాని ఇల్లుండదా? ఇల్లుంటేకాని డబ్బుండదా? అబ్బాయి బుర్రలో మాత్రం తిరుగని తరుగని ప్రశ్నలు దాడు తీస్తున్నట్టున్నాయి! అందుకే బేలగా చూస్తూ నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"అమ్మా...అయితే...అక్కడపోయి పడుకుంటే?...మన్ని రానివ్వరా?" మాటలలో వేగం, ఉద్రేకం, క్రోధం మిళితమయి ఉన్నాయి.

"రానివ్వరు" అంది వచ్చే దుఃఖాన్ని దిగమ్రింగుతూ.

"ఎందుచేత?" సాభిప్రాయంగా ప్రశ్నించేడు.

దీనికేమని సమాధానం చెప్తుంది?...చెప్పగలదు! జీవితంపై రోతపుట్టి, ఎంత విరక్తిచెందినా, పసిగ్రుడ్డును, నవమాసాలు అష్టకష్టాలుపడి కన్న గారాబు బిడ్డని, నిరాధారంగా, దిక్కులేని పక్షిలా, ఈ లోకంపై దిగవిడిచి, తాను ప్రాణత్యాగానికి సాహసించలేక పోయింది. గత జీవితము, అంటే కొద్ది కాలముక్రింద తాను, తన భర్తతో...మితిలేని ఐశ్వర్యంతో,...మధురాతి మధురంగా, గడపిన రోజులు తలపుకొస్తే భూకంపంలా శరీరమంతా కంపించి పోతోంది! ఎలాగో గతాన్ని మరచి జీవితం ఎంత దుర్భరమైనా, పసిపాపపై ఆశపెట్టుకుని జీవచ్ఛవంలా నిలచిఉంది. దానికితోడు పసిబాలుడు, అమాయకంగా వేసే ప్రశ్నలు వింటే "గోరుచుట్టుపై రోకటి పోటన్నట్టు" గతం అంతా జ్ఞాపకమొచ్చి ప్రస్తుతపు హేయమైన, నిర్భాగ్యపు బ్రతుకుపై రోతపుట్టి, హృదయమంతా దుఃఖించే పొంగిపొరలు పోతోంది. అందుకే "పడుకో బాబూ...చాల రాత్రయింది...చెపుతాలే ప్రొద్దున్న ఏం?...పడుకో!" అంటూ బుజ్జగించి జోగొట్టుతోంది ఎలాగైనా మరపింపజేయు యత్నంతో! తన ప్రశ్నలకు తగిన, తనకు అర్థమయ్యే సమాధానం, రానికోపంతో మారు మాటాడకుండా అలాగే తల్లి హృదయంపై ఒరగి నిద్రలో మునిగిపోయాడు ఆ పసికందు.

టక్...టక్...టక్!

రాను రాను ధ్వని సమీపిస్తోంది!

ఎక్కడనుండి? ఎవరు? ఇంత నిశిథ సమయంలో ఆ ధ్వని?...

ఆ స్త్రీ హృదయం కలవరం చెందింది!

శరీరం వణుకుతోంది!

గొంతుక తడార్చుకు పోయింది! సరి! సమీపించేరు...నల్లని శరీరాలతో కండలు తిరిగిన భుజాలతో...మదపు టేనుగులను మించి మదించియున్న ఇద్దరు భయంకర వ్యక్తులు!

"ఎవరు నీవు? ప్రశ్నించేడు ఒకడు ఆమెను సమీపిస్తూ!

"నే..ను..ఆడదాన్ని. అనాథను నాయనా!" ఎలాగో బిక్కవచ్చి, సమాధానం చెప్పింది. పెదవుల వణుకు మాత్రం ఇంకా తగ్గలేదు!

"నడిరాత్రి సమయంలో ఇక్కడ ఏం చేస్తున్నావ్?" గంభీరంగా ప్రశ్నించేడు రెండవవాడు.

"ఏం చేయాలి నాయనా! దిక్కులేక నిలువ నీడలేక...ఇలా..." ఇంకా ఏమో అనబోతూంటే_

"ఆ...ఎందుకు చెప్తావులే [illegible]బుర్లు, నీ రవరో తెలుసా?–అసలు సంగతి చెపుదూ?...ఎవరికోసమేంటి కాచుకుకూర్చున్నావు?" ప్రశ్నించేడు హేళనగా నవ్వుతూ!

"ఎవరున్నారు...చూడడానికి...ఈ దిక్కుమాలినదానిని ఎవరు చూస్తారు—

ఎవరికి కావాలి ఈ అనాథ గొడవ?... ఎక్కడా నిలువ నీడలేక..." తరువాయి మాటలు దబ్బుకు వచ్చే దుఃఖంలో మునిగిపోయి స్వరవిహీనములయ్యాయి.

"ఎందుకులే...అలా అధైర్య పడతావు... అంత భయమెందుకు? పోనీ మాతో రాగూడదూ. భోజనం...బట్ట గట్ట ఇస్తాం. మాతో కలిసి ఉండు గాని!" అంటూ మొదటివాడు దగ్గరకుపోయి చేయి పట్టుకున్నాడు ఆదోలా చూస్తూ!

"పద...అలా చేయి, మాకు మాత్రం ఎవరున్నారేంటి?...వచ్చేయి మాతోటి...నీకే లోటు రాకుండా చూస్తాం..." అంటూ దగ్గరకూ లాగుతున్నాడు రెండవవాడు...

"వద్దు...నేను రాను, నన్ను బలవంత పెట్టకండి- దిక్కుమాలిన దాన్ని...నేను ఇలా అడుక్కుంటూనే కాలం గడుపుతాను. నన్ను అవమానపరచ వద్దు, నన్ను వదలండి...వెయ్యి దండాలు పెట్టుకుంటాను బాబూ!" అంటూ ఏకరోదన మొదలు పెట్టింది.

అంతలోకే బాలుడు లేచేడు, తల్లి ఏడుపువిని బెదరిపోయాడు. గుడ్లు తేలవేసి—బిక్కజచ్చి... కెవ్వుమన్నాడు...ఘోలు...ఘోలుమని గుక్కపెట్టి మరీ ఏడుస్తున్నాడు.

"ఒరే! చూస్తావేంరా? ముందు వాణ్ణి అరువకుండా చేయి...ఎవరైనా వింటే...వాడెవడురా మధ్య...వాడ్ని చూచుకుని ఇది మరీ బిర్ర బిగుస్తోంది..." అంటూ కఠినంగా ఆజ్ఞాపించేడు మొదటివాడు,

వెంటనే రెండవవాడు ఆ పసిబాలుని కాళ్లు చేతులు విరియ కట్టి—మాట రాకుండా నోట గుడ్డలు పెట్టి...చెట్టు మొదలకు కట్టేసేడు.

తన కళ్లముందు...తన బిడ్డ...ఇట్లా బాధ పడుతూంటే...ఆ మాతృ హృదయం ఎలా కొట్టుకుపోయిందో? గుండెలు ఎలా మండి పోతున్నాయో? రక్తం ఎలా ఉడికిపోతోందో?...కాని ఏమి చేయగలదు? అబల...అనాథ...నిరాధారపక్షి...ఎన్నో విధాల బ్రతిమలాడింది! ప్రాకులాడింది! ప్రాధేయపడింది! తన బిడ్డను, తనముందు అలా బాధ పెట్టవద్దని. కాళ్లా వేళ్లాపడి కన్నీటిచే వారి పాదాలను తడిపింది. కాని...వినే దెవరు? అరణ్య రోదనం! నీళ్లకు రాళ్లు కరుగుతాయా?

ఆమెలో అంతఃశక్తులన్నీ కలిసి లేని ధైర్యాన్ని రేకెత్తించేయి. సాహసించే ఒక్క ఉరుము ఉరిమింది! మహిషాసురిని మీదకు లంఘించే ఆదిశక్తిలా...ఒక్కమారు ప్రజ్వరిల్లింది. రెండు చేతులను విదల్చింది...కాని...ఏం లాభం? కొండతో ఢీకొన్న గొఱ్ఱెకు కలిగే ఫలితం? కొలిమిలోపడ్డ పురుగు బైటబడగలదా?

...ఇద్దరు కలసి ఆమె చేతులను విరిచుకట్టేరు ...బలవంతం చేయబోయారు...

"ఢాం" పెద్ద ధ్వని...!

ఎక్కడో?...తూకటి వ్రేళ్ళతో సహా నేల కూలిన ఒక పెద్ద వృక్షపు ధ్వనిలా ప్రతిధ్వనించింది!

ఆ ధ్వనికి ఇద్దరు హడలిపోయారు, కోపంతో చిక్కి...శల్యమై...అలసి సొలసి ఉన్న ఆ అనాథను...ఒక్క త్రోపు త్రోసేరు. పరుగు లఘించుకి ఒక్క సెకెనులో మాయమయ్యారు ఆ నరరూప రాక్షసులు,

ఆ రెండు జీవాలు ఏ చింత చీకూ లేకుండా శాశ్వతంగా నిద్రబోతున్నాయి.

అంతా నిశ్శబ్దం!

కాని...తీతిక మాత్రం తన "తీ...తీ" శబ్దంతో నిశ్శబ్దాన్ని కొంత ఆటంకపరుస్తోంది,